క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

కోరుట్లరూరల్: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం సూచించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలని, గోదావరి పరీవాహక ప్రాంతంలో రైతులు, గొర్రెలకాపరులు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్‌కు టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అమరేందర్‌రెడ్డి, రవిచంద్ర, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి



లచ్చిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్, భూమయ్య

జగిత్యాలరూరల్: జోన్–6 రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్లకు డెప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించడంపై తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి ఆనంద్‌కుమార్, కార్యదర్శి చిట్యాల భూమయ్య హర్షం వ్యక్తం చేశారు. 28 మందికి పదోన్నతి కల్పించగా, డెప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బానాల రాంరెడ్డి, సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలను బలోపేతం చేద్దాం

సారంగాపూర్: పాఠశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలని డీఈవో రాము కోరారు. శనివారం సారంగాపూర్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గ్రంథాలయ నిర్వహణపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంఈవో బుగ్గారపు కిషోర్, జిల్లా రిసోర్స్ పర్సన్ గోవర్ధనప్రసాద్, మండల రిసోర్స్ పర్సన్ శారద, హెచ్ఎం మండలోజు వేణుగోపాల్ పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

బీర్‌పూర్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థినుల సంఖ్య పెంచాలని డీఈవో రాము అన్నారు. తుంగూర్‌లో కొత్తగా ఏర్పాటైన కస్తూరిబా బాలికల విద్యాలయం, ఉన్నత పాఠశాల కాంప్లెక్ సమావేశంలో పాల్గొన్నారు. కేజీబీవీలో కేవలం 35 మందే ఉన్నారని, మరింత మందిని చేర్పాలన్నారు. ఎంఈవో నాగభూషణం, ప్రత్యేకాధికారి రజిత, హెచ్ఎం భాస్కర్ ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి ఎన్ఐఎస్ పట్టా



సర్టిఫికెట్ చూపుతున్న తిరుమలేశ్

మేడిపల్లి: భీమారం హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేశ్ పంజాబ్ రాష్ట్రంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ స్పోర్ట్స్ అకాడమీ నుంచి హ్యాండ్‌బాల్ విభాగంలో పట్టా పొందినట్లు హెచ్ఎం జవ్వాజి అశోక్ తెలిపారు. తిరుమలేశ్ పలువురు అభినందించారు. సాదుల ప్రసాద్, నరుకుల శ్రీధర్, నజీమా సాహెబా, ఎండీ.అప్సర్, కొప్పుల నరేందర్, కొక్కుల జయశ్రీ, నాగమల్ల రమేశ్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న వలంటీర్లు, అధ్యాపకులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ఇమ్రాన్ ఖాన్, ఎన్ఎస్ఎస్ పీవో గంగాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ ఎస్సై మల్లేశం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గౌతమ్‌మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

కూలిపోయి.. ఆనవాళ్లు కోల్పోయి

- చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఉపకాల్వలు
- మరమ్మతుకు టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- చివరి ఆయకట్టుకు సాగునీరు అందేనా?



ఇబ్రహీంపట్నంలో ఉపకాల్వ 24లో కూలిపోయిన సైడ్‌వాల్స్



పిచ్చిమొక్కలు, చెట్లతో నిండిన కాల్వ

ఇబ్రహీంపట్నం: కాకతీయ కాల్వ నుంచి పంటలకు సాగునీరు అందించే ఉపకాల్వలు దెబ్బతిన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని కాకతీయ కాల్వ ద్వారా 21 నుంచి 26 డిస్ట్రిబ్యూటర్ వరకు సాగునీరు అందించే కాల్వలు అక్కడక్కడ కూలిపోయి, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, బండరాళ్లతో నిండిపోయాయి. వాటిని తొలగించకపోవడంతో చివరి పంటలకు నీరు అందే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండిన తర్వాత కాకతీయ కాల్వ ద్వారా ఉప కాల్వలకు నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం ఉపకాల్వలు దెబ్బతినడంతో చివరి ఆయకట్టుకు నీరు అందుతుందో లేదోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని కాల్వలకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

రూ.64 లక్షలు మంజూరు

డిస్ట్రిబ్యూటర్ 24 కాల్వ మరమ్మతుకు రూ.64 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాల్వ వెంట ఇరువైపులా కూలిపోయిన సైడ్ వాల్స్‌కు మరమ్మతు చేపట్టి అక్కడక్కడా తూములతో పాటు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. అలాగే కాల్వల్లో రాళ్లురప్పలు, పిచ్చిమొక్కలు తొలగించాలి. ఈ పనులు చేపట్టేందుకు మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

వందలాది ఎకరాలకు సాగునీరు

మండలంలోని 5 డిస్ట్రిబ్యూటర్ కాల్వలతో సుమారు 6,104 ఎకరాలకు సాగునీరు అందుతోంది. డిస్ట్రిబ్యూటర్ 21 కింద 120 ఎకరాలు, 22 పరిధిలో 1,660 ఎకరాలు, 24 కింద 2,654 ఎకరాలు, 25 పరిధిలో 1,215 ఎకరాలు, 26వ కాల్వ కింద 454 ఎకరాల్లో పంటలు సాగవుతాయి.

మరమ్మతు చేయిస్తాం

డిస్ట్రిబ్యూటర్–24 మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. టెండర్లు పూర్తికాగానే మరమ్మతు పనులు చేయిస్తాం. కాల్వల్లో పిచ్చిమొక్కలు, బండరాళ్లను తొలగించి చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం.

– చేతన్, ఇరిగేషన్ ఏఈ, ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని 7వ వార్డులో గల దారిలో నడవకుండ ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ దారిగుండా విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. పిచ్చిమొక్కలను వెంటనే తొలగించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఇబ్రహీంపట్నం, సెల్ నంబర్ : 79897 15216

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

'బాల కవచ్'పై అవగాహన

జగిత్యాల: రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమంలో భాగంగా శనివారం హెల్త్ సిబ్బందికి బాల కవచ్ గురించి డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అవగాహన కల్పించారు. స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ కార్డులో విద్యార్థి దీర్ఘకాలికంగా ఏవైనా వ్యాధులకు చికిత్స తీసుకుంటున్నారో వివరాలు పొందుపర్చాలన్నారు. నోడల్ ఆఫీసర్ రమ, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, భూమేశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దం తర్వాత పేదలకు రేషన్‌కార్డులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: దశాబ్దకాలం తర్వాత పేదలకు రేషన్‌కార్డులు అందుతున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. బీర్‌పూర్‌లో 583 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఇందుకు రేషన్‌కార్డుపై సన్నబియ్యం అందించడం నిదర్శనమన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టుకు సంబంధించి అటవీశాఖ పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీనిపై సానుకూల నిర్ణయం వస్తుందని పేర్కొన్నారు. అలాగే 10 మంది లబ్ధిదారులకు రూ.2.50 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్, మరో పదిమందికి షాదీముబారక్ చెక్కులు అందజేశారు. డీఈవో రాము, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేశ్, ఎంఈవో నాగభూషణం, కేడీసీసీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

జగిత్యాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎమ్మెల్యే అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని నర్సింగ్ కళాశాలను తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, వంటగది, స్టోర్‌రూమ్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించగా.. ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సతీశ్, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంచాల కృష్ణ, శ్రీనివాస్, టీవీ.సూర్యం, రాజు, జగదీశ్, భూమేశ్వర్, కళాశాల ప్రిన్సిపల్ లిల్లిమేరి పాల్గొన్నారు.

షెడ్డు కూల్చారని కాంగ్రెస్ ఆందోళన



బల్దియా అధికారులు కూల్చిన షెడ్డు

జగిత్యాలటౌన్: బల్దియా అధికారులు ఉద్దేశపూర్వకంగానే షెడ్‌ను కూల్చివేశారంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. యూత్ నాయకుడు గుండ మధు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కోండ్ర రాజేశ్ పార్క్ ఎదుట వేసిన చిన్న రేకులషెడ్‌కు అనుమతి లేదంటూ అధికారులు జేసీబీతో తొలగించారని ఆరోపించారు. తాము జీవన్‌రెడ్డి వర్గీయులమనే కారణంగానే తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ సీఐ సముదాయించి ఆందోళన విరమింపచేశారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



జాతీయ జెండాలతో విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ హరిచరణ్‌రావు అన్నారు. శనివారం జ్యోతి హైస్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ఎంతో పోరాట పటిమను ప్రదర్శించి విజయం సాధించారన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతోపాటు సేవ దృక్పథం, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యదర్శి మధుసూదన్, శ్రీధర్‌రావు, మానికరావు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి



తహసీల్ చౌరస్తాలో జాతీయజెండాలతో నాయకులు



నివాళి అర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జగిత్యాలటౌన్/కోరుట్ల/మెట్‌పల్లి/పెగడపల్లి: కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ విజయాన్ని గుర్తు చేసుకుంటూ శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో భారత సురక్ష సమితి ఆధ్వర్యంలో కార్గిల్ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో అమర జవానులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మెట్‌పల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పెగడపల్లి మండలకేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: 2025–26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమాధికారి ఆర్ఎస్ చిత్రు తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు గడువు ఉందని, జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు..

బీడీ కార్మికుల పిల్లలు 2025–26 సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్ కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రీమెట్రిక్‌లో 1–10వ తరగతి విద్యార్థులు ఆగస్టు 31 వరకు, పోస్ట్‌మెట్రిక్ కేటగిరీలో ఇంటర్, ఆపై కోర్సులు చదివే విద్యార్థులకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలకు టీగెట్

తెలంగాణ గెట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రెనింగ్ ఎంప్లాయిమెంట్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. జగిత్యాల టీసీ సెంటర్‌లో రెండో విడత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులు ఏటీసీ కోర్సుల కోసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీ

వెల్గటూర్: పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన మండలంలోని పైడిపెల్లిలో చోటుచేసుకుంది. కార్యదర్శి గంగాధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన క్యాతం బుచ్చయ్య తన ఇంటిని తన కొడుకు పేరిట గిఫ్ట్ డీడ్ చేసే క్రమంలో కార్యదర్శి ధృవీకరణ పత్రం అవసరమైంది. అయితే డమ్మీ స్టాంపులు తయారు చేసి..కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. దీనిపై గంగాధర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా..

బీజేపీ నాయకుల సంబరాలు

ధర్మపురి: ప్రధాని మోదీ అత్యధిక కాలం కొనసాగుతూ దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రికార్డును బద్దలుకొట్టిన సందర్భంగా శనివారం ధర్మపురిలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

సెర్ప్ ఏపీఎంగా చిన్న రాజయ్య

కథలాపూర్: కథలాపూర్ మండల సెర్ప్ ఏపీఎంగా మల్యాలలో పని చేస్తున్న చిన్న రాజయ్య శనివారం నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న నరహరి రాయికల్‌కు బదిలీ అయ్యారు.

అమ్మ ఆదర్శ కళాశాల కమిటీ

కొడిమ్యాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ వేణు ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ కళాశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మల్యాల సునీత ఎన్నికయ్యారు.

ఏఈని నియమించాలని వినతి

బుగ్గారం: మండలంలో మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు నూతనంగా ఏఈ పోస్టు మంజూరు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ వినతిపత్రం అందించారు.

బీఆర్ఎస్ సమావేశం

బుగ్గారం: మండలంలోని వెల్గొండలో శనివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లికి చెందిన పల్లి జమున అనారోగ్యానికి గురికాగా వైద్యం కోసం విప్ ఆది శ్రీనివాస్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారు.

పరామర్శ

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబాలను శనివారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పరామర్శించారు.

మల్లాపూర్‌లో 20.5 మీ.మీ వర్షం

మల్లాపూర్: మండలవ్యాప్తంగా శనివారం 20.5 మీ.మీ వర్షం కురిసిందని ఏఎస్‌వో పురుషోత్తం తెలిపారు.

లైబ్రరీ పీరియడ్ తప్పనిసరి

కోరుట్ల: ప్రతీ పాఠశాల టైమ్ టేబుల్‌లో లైబ్రరీ పీరియడ్ తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో నరేశం అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక, మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు.

పుస్తక పఠనం అలవాటు చేయించాలి

కథలాపూర్: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ఉపాధ్యాయులు పుస్తక పఠనం అలవాటు చేయించాలని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో అన్ని గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 'పాఠశాల గ్రంథాలయం' పై శిక్షణ తరగతులు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సీజనల్‌వ్యాధులపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్: ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు, మననేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బొడ్డు రాజేశ్ అన్నారు. శనివారం మండలంలోని సాతారంలో శ్రీ ఆదిత్య ఐ కేర్, నిజామాబాద్ లయన్స్‌క్లబ్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరంలో పాల్గొన్నారు.

పాత ఇందిరమ్మ ఇళ్ల కూల్చివేత



పాత నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

జగిత్యాల: నూకపల్లి సమీపంలో గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను అధికారులు జేసీబీల సహాయంతో కూల్చివేయిస్తున్నారు. కొందరు బేస్‌మెంట్, గోడలు, కొందరు స్లాబ్ వరకు నిర్మించుకున్నారు. వసతులు లేకపోవడంతో వెళ్లలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 4500 డబుల్‌బెడ్‌రూంలను ఆ సమీపంలోనే నిర్మించారు. ప్రస్తుతం కొందరు లబ్ధిదారులు డబుల్ ఇళ్లలో నివసిస్తున్నారు. వసతుల కోసం ప్రభుత్వం ఇటీవల రూ.20 కోట్లు కేటాయించింది. ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల కోసం స్థలాలు గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను కూల్చివేయడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కొత్తగా ఇళ్లు కేటాయిస్తారా..? నోటీసులు ఇవ్వకుండానే ఎందుకు కూల్చివేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై హౌసింగ్ శాఖ అధికారి ప్రసాద్‌ను వివరణ కోరగా వసతుల కోసం స్థలాలు సేకరిస్తున్నారని, కొన్ని బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న వాటిని మాత్రమే కూల్చివేశామని, వారికి ఏం చేయాలన్నదానిపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థ ఇళ్లను కూల్చివేయాలి



శిథిలావస్థ ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్ రవీందర్

కోరుట్ల: నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ సూచించారు. శనివారం పట్టణంలోని పలు వార్డులను సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివాసముండే వారిని ఖాళీ చేయించారు. శిథిలావస్థ ఇళ్లను కూల్చివేసుకోవాలని నోటీసులు జారీ చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కథలాపూర్‌లో భారీ వర్షం

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. ఉదయం ముసురు పెట్టగా.. మధ్యాహ్నం భారీగా వర్షం కురిసింది. వర్షంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. రోడ్లపై వరదనీరు చేరింది.

నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం



బుగ్గారంలో ప్రధాన రహదారిపై వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

బుగ్గారం: అధికారులు ఎంత చెప్పినా, హెచ్చరించినా ట్రాక్టర్ యజమానుల తీరు మారడం లేదు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో రోడ్లు వేస్తున్నా వాటిని సంరక్షించుకోవడంలో ఎవరికీ బాధ్యత ఉండడం లేదు. నాట్ల సీజన్ వచ్చిందంటే చాలు కేజ్‌వీల్స్ ట్రాక్టర్స్ యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. దీంతో ఐదు నుంచి పదేళ్లు బాగుండాల్సిన రోడ్లు ఒకటి రెండేళ్లలోనే పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈక్రమంలో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపినవారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.





నీడనిచ్చి.. జ్ఞాపకాలు మిగిల్చి

వెల్గటూర్: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రాంనూర్‌లో భారీ వృక్షం నేలకొరిగింది. రాంనూర్ గ్రామ స్టేజీ వద్ద సుమారు వందేళ్ల చరిత్ర కలిగి, ఎంతో మందికి నీడనిచ్చి, ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన రావిచెట్టు పడిపోవడంతో గ్రామపస్తులు ఆవేదన చెందుతున్నారు.

శ్రావణమాస పూజలు

కథలాపూర్: శ్రావణమాసం శనివారం సందర్భంగా మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తమ ఇలవేల్పునకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.